దారంతా మురుగు..
వేయలేకపోతున్నాం అడుగు!





గత మూడ్రోజుల నుంచి బండ్లగూడ ప్రధాన రహదారిపై డ్రైనేజీ పొంగి రహదారిపై ఏరులై పారుతున్నా పట్టించుకునే నాథులే లేరని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విజయగార్డెన్, శ్రీనివాస్ కాలనీలతో పాటు ఇతర కాలనీ వాసులు డ్రైనేజీ నుంచి వెలువడే దుర్వాసనతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. నామమాత్రపు మరమ్మతులతో సమస్యలు మళ్లీ మొదటికి వస్తుందని వాపోతున్నారు. బండ్లగూడ పాత గ్రామంలో ఇళ్ల ముందు నిత్యం పారుతున్న మురుగుతో దుర్వాసన, దోమలు పెరిగి వివిధ రోగాలబారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షంతో డ్రైనేజీ నీరు రోడ్డు మీద పారుతుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు వాహనదారులు వాపోతున్నారు. పక్కనే ఉన్న బస్టాప్‌లో ప్రయాణికులు ఉండలేని పరిస్థితి ఏర్పడింది. బండ్లగూడ చౌరస్తాలో నూతన డ్రైనేజీ పైపులైన్ నిర్మాణం చేపట్టి మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని ఆయా కాలనీలవాసులు కోరుతున్నారు.

– నాగోలు



మురుగులో నుంచి వెళ్తున్న వాహనాలు



రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు టమాటా రూ.13, వంకాయ రూ.18, బెండ రూ.35, పచ్చిమిర్చి రూ.40, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.38, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.08, క్యారెట్ రూ.23, దొండ రూ.28, ఆలుగడ్డ రూ.24, ఉల్లిగడ్డ రూ.22, గోకరకాయ రూ.35, దోసకాయ రూ.18, సొరకాయ రూ.09, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.55, చామగడ్డ రూ.35, మునగ రూ.23, కందగడ్డ రూ.80, బీట్‌రూట్ రూ.13, కీర రూ.23, బీన్స్ రూ.55, క్యాప్సికమ్ రూ.35. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

పీఆర్సీ అమలుపై హర్షం

చాదర్‌ఘాట్: ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పీఆర్సీల అమలుపై జీవో రావటంతో రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ ఉద్యోగుల్లో ఆనందం వెల్లువెరిసింది. 2010, 2015, 2020 నుంచి టీవీసీసీ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు పీఆర్సీలు లేవు. రెండ్రోజుల క్రితం పీఆర్సీల జీవో విడుదల కావడంతో టీవీసీసీలో పని చేస్తున్న 31 మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరింది. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న పీఆర్సీ జీవో ఇవ్వటం ప్రభుత్వానికి ఉద్యోగుల తరఫున అభినందనలు తెలుపుతున్నామని ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.రాములు అన్నారు.

ఒక్క రోజులోనే కుల, ఆదాయ సర్టిఫికెట్లు జారీ

చాదర్‌ఘాట్: రాజీవ్ యువ వికాసం రుణాలకు కుల, ఆదాయ సర్టిఫికెట్లకు దరఖాస్తు చేసుకున్న ఒక్క రోజులోనే జారీ చేస్తున్నామని అంబర్‌పేట తహసీల్దార్ వీరాబాయి తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు దాదాపు 4300 కుల,ఆదాయ సర్టిఫికెట్లు జారీ చేశామని ప్రతిరోజు రాత్రి 12 గంటల వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్స్ చేసి ఆన్‌లైన్‌లో పెడుతున్నామన్నారు. ఎవరూ దళారులను నమ్మవద్దని నేరుగా తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి వివరాలు తీసుకోవాలన్నారు.

ప్రత్యేక పూజలు



అమ్మవారి దర్శించుకున్న నిరంజన్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురంలోని కుర్తాళ పీఠం శ్రీ ప్రత్యంగిరా పరమేశ్వరి అమ్మవారిని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుర్తాల పీఠాధిపతులు జగద్గురువులు సిద్ధేశ్వరానంద భారతి మహా స్వామి వారి అనుగ్రహంతో శక్తి దేవత మహా ప్రత్యంగిరా దేవాలయం మన హైదరాబాద్‌లో ఉండడం అదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో చాడ కిషన్‌రెడ్డి, సంగమేశ్వర రావు, రాజగోపాల్, శశివర్ధన్ రెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసంకు దరఖాస్తు చేసుకోండి

మీర్‌పేట: రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించి పట్టణ పరిధిలోని అర్హత గల నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నామని కమిషనర్ జ్ఞానేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు చెందిన నిరుద్యోగులు దరఖాస్తుతో పాటు ఆధార్‌కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు మున్సిపల్ కార్యాలయంలో సమర్పించాలని, దివ్యాంగులు అయితే ధ్రువపత్రం, విద్యార్హతలు, ఏదైనా శిక్షణ పొందిన ధ్రువపత్రం, డ్రైవింగ్ లైసెన్సును జతచేయాలని సూచించారు. ఈ నెల 14వ తేదీలోపు దరఖాస్తులు అందించాలని, అర్హులందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆయన కోరారు.

పార్కులు అభివృద్ధి చేయాలని వినతి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని రామిడి మల్లారెడ్డినగర్ కాలనీలో సుమారు 800 వందల చదరపు అడుగులు ఉన్న పబ్లిక్ పార్క్ స్థలాన్ని అభివృద్ధి చేయాలని కోరుతూ మంగళవారం కాలనీవాసులు కమిషనర్ పి.సరస్వతికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్కుల అభివృద్ధి లేకపోవడంతో చిన్నారులు ఆటవిడుపు, పెద్దలు వ్యాయామం, వాకింగ్ చేయడానికి అవకాశం లేకుండా ఇంట్లోనే ఉండి సతమతం అవుతున్నారన్నారు. పిల్లలకు, పెద్దలకు, విశ్రాంత ఉద్యోగులకు, మహిళలకు అందరికీ ఉపయోగపడేలా పార్కులు తీర్చిదిద్దాలని విన్నవించారు. స్పందించిన కమిషనర్ హెచ్ఎండీఏ నిధులతో పార్కును అభివృద్ధి చేస్తామని వారికి హామీనిచ్చారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రామిడి శ్రీనివాస్‌రెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నవారు మల్లారెడ్డి ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

మహేశ్వరం: ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటూ సహాయం అందిస్తానని తుమ్మలూరు మాజీ సర్పంచ్ మద్ది కరుణాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని తుమ్మలూరు గ్రామంలో పాలోజీ పద్మమ్మ మరణించడంతో వారి కుటుంబానికి రూ.10వేల ఆర్థికసాయం ఆయన అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ మద్ది శ్రీధర్‌రెడ్డి పలువురు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



ఎమ్మెల్యే బలాలకు సమస్య వివరిస్తున్న కాలనీవాసులు

మలక్‌పేట: సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. మూసారంబాగ్ డివిజన్ సలీంనగర్ కాలనీలో మంగళవారం ఆయన పర్యటించి స్థానిక సమస్యలపై ఆరా తీశారు. హిల్ వ్యూవ్ అపార్ట్‌మెంట్ లైన్‌లో డ్రైనేజీ సమస్య పరిశీలించిన అనంతరం మాట్లాడారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆధికారులను ఆదేశించారు. శాశ్వత పరిష్కారం కోసం అవసరమైతే పనులకు కొత్త ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. వేసవిలో తాగునీరు, లోప్రెషర్, డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట వాటర్ వర్క్స్ డీజీఎం హస్మత్‌అలీ, ఏరియా మేనేజర్ వెంకట్, జీహెచ్ఎంసీ ఏఈ శరత్, సైట్ ఇంజినీర్ ఏడుకొండలు, కాలనీవాసులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

మన్సూరాబాద్: నాగోలు డివిజన్ పరిధి ఎరుకల నాంచారమ్మ బస్తీకి చెందిన జగన్నాథం గంగయ్య ఆధ్వర్యంలో సుమారు 50 మంది బస్తీవాసులు టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ సమక్షంలో సోమవారం రాత్రి హస్తినాపురంలో జరిగిన సభలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా మధుయాష్కీగౌడ్ పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గంగయ్య మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వంలో సామాన్యులకు న్యాయం జరుగుతుందని, అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు దక్కుతాయనే ధీమాతో కాంగ్రెస్‌లోకి చేరామన్నారు.



కాంగ్రెస్‌లోకి చేరుతున్న ఎరుకల నాంచారమ్మ బస్తీవాసులు

చలివేంద్రం ఏర్పాటు..

వనస్థలిపురం: వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని మధుయాష్కీగౌడ్ అన్నారు. వనస్థలిపురంలో శ్రీనివాస టూర్స్ అండ్ ట్రావెల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రద్దీ ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ కాశిరెడ్డి, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సంస్థ నిర్వాహకులు శ్రీనివాసరావు, నాయకులు మిట్టా రాంమోహన్, ఎన్వీ.రమణరావు పాల్గొన్నారు.

కామినేని వైద్య కళాశాల అధ్యాపకురాలికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న డాక్టర్ నాగతేజ పావని

నాగోలు: ఎల్బీనగర్ కామినేని వైద్య కళాశాలలోని ఫార్మకాలజీ విభాగంలో గత పన్నెండేళ్లుగా అధ్యాపకురాలిగా సేవలందిస్తున్న నాగోలు సాయినగర్ నివాసి అక్కపెద్ది నాగతేజ పావనికి చెన్నైలోని సవితా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. వర్సిటీకి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి.షీలా పర్యవేక్షణలో ఆమె 'ఎవాల్యుయేషన్ అఫ్ హైపోలిపిడెమిక్ ఆక్టివిటీ అఫ్ కలాన్చొపిన్నట అండ్ ఫైకస్ రేసిమోసా ఇన్ విస్టార్ ఆల్బినో రాట్స్' అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ పట్టా పొందారు. ఈ సందర్భంగా మంగళవారం డాక్టర్ నాగతేజ పావని మాట్లాడుతూ తన పరిశోధన ఫలితాలు ఊబకాయం, మధుమేహం వంటి పలు సమస్యలకు పరిష్కారం కనుగొనే దిశగా తోడ్పడతాయని చెప్పారు. తాము మిద్దె పంటగా పెంచుకున్న రణపాల మొక్కలో మంచి ఔషధ గుణాలు ఉన్నాయని తెలిపారు. వీటి ద్వారానే తాను పరిశోధనలో ముందుకు వెళ్లినట్లు చెప్పారు.

ఆధ్యాత్మిక చింతన ఉండాలి

మలక్‌పేట: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మండడి విజయసింహారెడ్డి, ఏ–బ్లాక్ అధ్యక్షుడు బద్దం సురేందర్‌రెడ్డి అన్నారు. దిల్‌సుఖ్‌నగర్ మారుతి మందిర్‌లో జరిగిన సాంస్కృతిక ప్రదర్శన కార్యక్రమానికి వారు హాజరై మాట్లాడారు. ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవడం ద్వారా ఎంతో సంతృప్తి ఇస్తుందన్నారు. అనంతరం కళాకారులను సన్మానించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దిల్‌సుఖ్ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు హెచ్ ఆర్ ప్రవీణ్, ధర్మకర్తలు చిట్టంపల్లి కిరణ్‌కుమార్, బొట్టు శ్రీనివాస్, సంధ్య, చంద్రయ్య, నరేందర్ పాల్గొన్నారు.



కళాకారులతో ఆలయ కమిటీ ధర్మకర్తలు

'బీజేపీ అధికారంలో మహిళలపై దాడులు పెరిగిపోయాయి'

నాగోలు: దేశంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలపై దాడులు పెరిగిపోయాయని, నాగాలాండ్‌లో జరిగిన ఘటనలు చాలా దుర్మార్గంగా ఉన్నాయని భారత జాతీయ మహిళ సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) జాతీయ నాయకురాలు ప్రేమ్‌పావని, సీపీఐ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి ఛాయాదేవి అన్నారు. భారత జాతీయ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం నాగోలు సాయినగర్‌లోని ధర్మభిక్షం భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఇరువురు పాల్గొని మాట్లాడారు. సమాజంలో సగ భాగమైన మహిళలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నిత్యం దాడులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఎక్కడో ఓ చోట మహిళలపై అత్యాచారాలు, దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. భారత జాతీయ మహిళా సమాఖ్య ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు మహిళల సమస్యలపై పోరాటం చేసిందన్నారు. దేశంలో మహిళ కోసం ఎన్ని చట్టాలు వచ్చినా ప్రభుత్వాలు మారినా మహిళల బతుకులు మారలేదన్నారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు చందు, భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎండీ ఫైమీద మాట్లాడుతూ.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయని ఆరు, గ్యారంటీల అమలు కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

◆ అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా ఫైమీద, సభ్యులు సహేదబేగం, దనమ్మ, పద్మ, అచ్చొలి, కమిలి, ప్రమీల, హేమలత, అంజమ్మ, బాలమని, పద్మ, నిర్మలమ్మ, విజయలక్ష్మి, చిన్నమ్మ, మణమ్మ, హేమలత, లక్ష్మి, లావణ్య షమీం, పల్లవి, అరుణ, సాయమ్మ, సరోజ ఎన్నికయ్యారు.



సమావేశంలో పాల్గొన్న ప్రేమ్‌పావని, ఛాయాదేవి

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

హయత్‌నగర్: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు గాయపడిన ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎల్బీనగర్ వైపు నుంచి వస్తున్న ఆటోను హయత్‌నగర్ అంబేడ్కర్ చౌరస్తా వద్ద వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీ కొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఎల్బీనగర్ కాకతీయనగర్‌కు చెందిన బుగత ఎల్లయ్య(52) తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆటో నడుపుతున్న రేవెల్ల జంగయ్య స్వల్పంగా గాయపడ్డాడు. మృతుడి కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

హయత్‌నగర్: పెద్దఅంబర్‌పేట మున్సిపల్ పరిధిలోని పసుమాములలో కొలువైన రామగిరి గుట్ట శ్రీ సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజులపాటు జరిగే ఈ జాతరలో భాగంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పుట్టమన్ను తెచ్చి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. శుక్రవారం సాయంత్రం సీతారాముల కల్యాణం ఉంటుందని ఆలయ కమిటీ చైర్మన్ కొత్తపల్లి జైపాల్‌రెడ్డి తెలిపారు. చుట్టుపక్కల గ్రామాలతో పాటుగా నగరం నుంచి వేలాదిగా తరలి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు ఆయన ఓ ప్రకటనలో తెలిపారు.

బీజేపీని ఆదరించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు



మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్, వేదికపై ఎంపీలు లక్ష్మణ్, విశ్వేశ్వర్‌రెడ్డి

మన్సూరాబాద్: బీజేపీని ఆదరించేందుకు తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉన్నారని బీజేపీ ఎంపీలు లక్ష్మణ్, ఈటల, విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా నూతన అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి పదవీ బాధ్యతల స్వీకారోత్సవం, అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాలు మన్సూరాబాద్‌లోని ఎంఈరెడ్డిగార్డెన్స్‌లో మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వారు మాట్లాడుతూ.. బీజేపీ ఎన్నికల మ్యానిఫెస్టోలోని అంశాలైన 370 ఆర్టికల్ రద్దు, రామ మందిర నిర్మాణంను ప్రధాని మోదీ సమర్థవంతంగా అమలు చేశారన్నారు. పేదల సంక్షేమమే అజెండా మోదీ పనిచేస్తున్నారని కేసీఆర్ పదేళ్ల పాలన తర్వాత ఎదుర్కొన్న ప్రజావ్యతిరేఖతను రేవంత్ రెడ్డి 9 నెలల్లోనే ఎదుర్కొంటున్నాడని దుయ్యబట్టారు. రేవంత్ సర్కారు కమీషన్ల సర్కారుగా మారిందని, సాక్షాత్తు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చాంబర్ ఎదుట కాంట్రాక్టర్లు పెండింగ్ బిల్లులు చెల్లించాలని ధర్నా చేశారని విమర్శించారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో మేయర్ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ ప్రభాకర్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జల ప్రేమేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు గంగిడి మనోహర్‌రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు, కళ్లెం రవీందర్‌రెడ్డి, పేరాల శేఖర్‌రావు, కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, మొద్దు లచ్చిరెడ్డి, వంగ మధుసూధన్‌రెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డి, రంగ నర్సింహ్మగుప్తా, బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

పుస్తె మెట్టెలు అందజేత

నాగోలు: పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఉప్పల ఫౌండేషన్ అండగా ఉంటుందని టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ కోకన్వీనర్, ఫౌండేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. మహబూబాబాద్ జిల్లాకు చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన ప్రతావని రమేష్ రాణి కుమార్తె స్వప్న వివాహం సందర్భంగా మంగళవారం శ్రీనివాస్‌గుప్తాను నాగోలులోని ఆయన నివాసంలో కలువగా పుస్తె మెట్టెలు చీర అందజేశారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

హస్తినాపురం: భార్యా,భర్తల నడుమ జరిగిన చిన్నచిన్న గొడవలతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, పల్నాడు జిల్లా గుంటూరు మండలం సత్తెనపల్లి గ్రామానికి చెందిన పొట్టి వెంకటరామక్రిష్ణ(47) మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని చిత్రసీమ కాలనీలోని మహాలక్ష్మీ రెసిడెన్సీలో భార్య, కూతురితో కలిసి నివాసముంటున్నాడు . గత కొంతకాలంలో దంపతుల నడుమ చిన్నచిన్న గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపానికి గురైన వెంకటరామక్రిష్ణ మంగళవారం క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గత కొంతకాలంగా తన భార్యతో తరుచూ గొడవలు జరుగుతున్నాయని, దీంతో తాను ఆత్మహత్యకు పాల్పడినట్లు సూసైడ్ నోట్‌లో రాసి ఉందని ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చూడాలి

ఎమ్మెల్యే సబితారెడ్డి

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలో వేసవికాలంలో నీటి ఎద్దడి లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి జలమండలి అధికారులను ఆదేశించారు. జల్‌పల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం ఆమె మున్సిపాలిటీ, జలమండలి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వేసవి సందర్భంగా ప్రజలకు ఎట్టి పరిస్థితుల్లోనూ నీటి సమస్య రానివ్వకుండా చూసుకోవాలన్నారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్ రూపొందించుకోవాలని సూచించారు. ముఖ్యంగా బోడిగుట్ట రిజర్వాయర్‌ను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలన్నారు. నీటి కనెక్షన్లకు సంబంధించి ప్రజలకు క్యాన్ నంబర్ ఇచ్చినట్లయితే డిమాండ్‌కు తగ్గ నీటి సరఫరా చేసేందుకు వీలుంటుందన్నారు. మున్సిపాలిటీ ప్రజలు కూడా నీటి పొదుపుగా వాడాలని సూచించారు. సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్, జలమండలి డిప్యూటీ జీఎం శ్రీనివాస్, మాజీ చైర్మన్ అబ్దుల్లా సాది తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆమడ దూరంగా జల్‌పల్లి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీరాములుయాదవ్

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలో మున్సిపల్ అధికారులు ఒక వర్గ ప్రజల వద్దనే ఆస్తి పన్నులు వసూలు చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మహేశ్వరం ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ అన్నారు. బీజేవైఎం మున్సిపాలిటీ అధ్యక్షుడు పెబ్బేటి నాగార్జున ఆధ్వర్యంలో శ్రీరామకాలనీలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరాన్ని ఆనుకొని ఉన్న జల్‌పల్లి మున్సిపాలిటీ ఇప్పటికీ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందన్నారు. గోతులమయమైన రహదారులు, పడకేసిన పారిశుద్ధ్యంతో ప్రజలు నిత్యం నరకం అనుభవిస్తున్నారని వెల్లడించారు. హిందువులు నివాసం ఉండే బస్తీలలోనే అధికారులు ట్యాక్స్‌లు వసూలు చేస్తున్నారని, కానీ అభివృద్ధి పనులు చేయడం లేదన్నారు. రాయల్ కాలనీలో అక్రమంగా నివాసం ఉంటున్న వేలాది మంది రోహింగ్యా ముస్లింలను వెంటనే ఇక్కడి నుంచి పంపించేయాలన్నారు. ఇక్కడి ముస్లింలు కూడా వారిని దూరంగా పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు ఎం.వివేకానందగౌడ్, నాయకులు గొరిగె మల్లేశ్‌యాదవ్, గణేశ్ చింబోలే, శ్రీనివాస్‌యాదవ్, శాంత కుమార్, మనోజ్‌కుమార్, సంతోష్‌కుమార్, బోడ హరికృష్ణ, రాజేందర్, కిట్టు తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామి హుండీ లెక్కింపు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్‌లో గల రామలింగేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. ఆలయ ఈఓ శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక మాజీ కార్పొరేటర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు టేకుల శశిధర్‌రెడ్డి, డైరెక్టర్ల ఆధ్వర్యంలో హుండీ ఆదాయాన్ని లెక్కింపు చేపట్టారు. ఈ సందర్భంగా రూ.34,345లు ఆదాయం రాగా వాటిని దేవస్థానం బ్యాంక్ ఖాతాలో జమ చేయవలసిందిగా దేవస్థానం మేనేజర్ సీహెచ్.శ్రీనివాసరావుకు వారు అప్పగించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు ఇక్కె మాధవిశ్రీనివాస్, కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, పగడాల ఉమేశ్, ఆలయ అర్చకుడు దుర్గాప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ గోపి తదితరులు పాల్గొన్నారు.